ఆమె గురించి ఆలోచిస్తూ రెండు గంటలు గడిపాడు భోజనం చేసి మంచం మీద నడుం వాల్చాడో-లేదో తలుపు తట్టిన శబ్దం వినిపించింది. తలుపు తీశాడు. ఎదురుగా ఆమె అందాల అప్సరసలా నిలబడి ఉంది "ఒకసారి మా ఇంటికి వస్తారా. మీకో విషయం చెప్పాలి" అందామె. అలా అంటున్నప్పుడు ఆమెలో సిగ్గుని చూశాడతను "చుట్టూపక్కల ఇళ్ళ వాళ్ళందరూ పడుకున్నట్టున్నారు" అందామె కొంచెం గబగబా. "అలాగే. వస్తున్నాను పదండి" అన్నాడు ఆమెను అలా ఎక్కువసేపు నిలబెట్టడం ఇష్టంలేక. "మెల్లిగా శబ్దం చెయ్యకుండా రండి" అందామె వెళ్తూ. "అలాగే అలాగే" అన్నాడు శంకర్. తాము ద్దరూ అలాంటి పరిస్థితిలో ఉండగా ఎవరయినా చూస్తే బాగుండదు. ప్రేమ మొదటి అధ్యాయంలో ఉండగానే అందరికీ తెలిస్తే ఏం బావుంటుంది అనిపించిందతనికి. చొక్కా వేసుకుంటూ ఎన్నో విషయాలు ఆలోచించాడు. తను ఎంత అదృష్టవంతుడు! ఈ అమ్మాయికి అందంతో పాటు తెలివితేటలు కూడా ఉన్నాయి. అందుకే ఇన్నాళ్ళూ తన మీద ఎంత అనురాగమున్నా బయట పడకుండా ఎంతో జాగ్రత్తపడింది. అవకాశం కోసం ఎదురుచూసి వాళ్ళన్నయ్య ఊళ్ళోలేని సమయంలో ఎవరూ చూడకుండా తనని పిలిచి ఆ విషయం మాట్లాడాలనుకోవటం-నిజంగా ఆమె ఎంత బాగా ఆలోచించింది. ఇలా ఆలోచిస్తూనే శంకర్ వాళ్ళ పోర్షన్‌లోకి అడుగుపెట్టాడు. ఆమె అలాగే ఆతృతగా అతని రాక కోసం ఎదురుచూస్తూ నిలబడి ఉంది. ఆమె అతన్ని చూసింది. అతడు ఆమెని చూశాడు. ఆమె నుదుటి మీద స్వేద బిందువులు. పెదవులు వణుకుతున్నాయి.

ఆమె ఆ విషయం ఎలా చెప్పాలా అని తటపటాయిస్తోందని గ్రహించాడు శంకర్. ఎంతైనా ఆడదికదా. పైగా ఫస్ట్ ఎక్స్‌పీరియన్స్ తనకీ అది మొదటి అనుభవమే. అయినా తను మగవాడు.

"మీకో మాట చెప్పాలి. ఇక్కడ కాదు. ఇలా బెడ్ రూమ్‌లోకి రండి." అలా అంటున్నపుడు సిగ్గుగా ఆమె కళ్ళని పైకెత్తి అతని వైపు అదోలా చూడటం గమనించాడు. ఆమె ఆ మాట అని గది మూలకి మెల్లిగా నడిచి వెళ్ళింది. అతను బెడ్ రూమ్‌లోకి అడుగుపెట్టాడు.

వెనుక వచ్చిన ఆమె అతని చేతిలో కర్ర అందించి బెడ్ వైపు చూపిస్తూ "పా.... పాము" అంది. ఆమె నుదుటిమీద స్వేద బిందువులు ఆమె పెదవులు వణుకుతున్నాయి.

బెడ్ మీద నిశ్చలంగా నిద్రపోతోంది పాము.

---

# పుస్తక సర్కిల్

గుడిమెట్ల గోపాలకృష్ణ

పుస్తకం పరహస్తం గతంగతః అన్నారు పెద్దలు.

గెజిటెడ్ ఆఫీసర్ల కాలనీలో ఆరే ఆరు ఫ్లాట్స్ వున్నాయి అందంగా.

ఆఫీసులో పొజిషన్ల మాట ఎలా వున్నా ఇంటి దగ్గర, ఇంటిని తీర్చిదిద్దడంలోనూ, అతిధుల్ని ఆహ్వానించడంలోనూ, కబుర్లు చెప్పడంలోనూ ఆధిక్యతను నిరూపించుకునేందుకు ప్రతి ఇల్లాలూ ప్రయత్నిస్తోందనడం పచ్చి నిజం.

ఇది ఇలా వుండగా నంబర్ వన్ ఫ్లాట్‌లో వున్న ఎల్లెస్ మణ్యం శ్రీమతి 'మిసెస్ మణ్యం' మాట్లాడుతూ మాట్లాడుతూ 'మిస్టర్ మణ్యం చవకరకం పుస్తకాలు చదవరండీ. చూశారా ఈ రెండు వందల పేజీలున్న ఇంగ్లీషు నవల ప్రఖ్యాత రచయిత హైలీది. పారిస్ పేపరు.... సాహిత్యమంటే చెవికోసుకుంటారాయన.' అందోలేదో 'మా మిస్టర్ షా కూడా అంతేనండీ. రోజుకో పుస్తకం చదివేస్తారు. ప్రతి ఆదివారం కొత్త ఇంగ్లీషు నవల కొంటారు. డిటెక్టివ్స్. పొయిట్రీ ... ఒహటేమిటి. ఎలాగూ మాటొచ్చింది కాబట్టి అడుగుతున్నాను. అదివ్వండి. చదివి మళ్ళీ ఇచ్చేస్తాను. షా గారు కూడా నిముషాల్లో చదివేస్తారు" అంది మిసెస్ షా.

మర్నాడు మళ్ళీ కల్సుకున్నప్పుడు మిసెస్ మణ్యం "ఎలా వుందన్నారు మీ షా గారు!"

"మార్వలెస్. హైథాట్‌లోవుందన్నారు. నా మట్టుకు నేను బిగపట్టి చదివేశాను" నిజానికి మిస్టర్ & మిసెస్ షా ఎవరూ చదవలేదు.

ఇలా ఎవరూ చదవకుండానే తక్కిన నాలుగు ఫ్లాట్సూ తిరిగేసింది పుస్తకం.

* * *

ఆఫీసులో ఆఫీసర్ల టాక్ ప్రారంభమైంది

పుస్తకం గురించి అడిగితే బాగుండదని వూరుకుంది. కొంతమంది గంటలో చదివేస్తారు. కొంతమంది నెలలు చదువుతారు. అదీ ఆమె ఆలోచన!




"మా మిసెస్ ఎలా సంపాదించిందో నోయ్. బ్రహ్మాండమైన నవల హైలీది".

"ఓసారియ్యండి చదివి ఇచ్చేస్తాను" అని తెచ్చి రేక్‌లో పెట్టి తాళం బిగించేడు ఎల్లెస్ మణ్యం.

ఆ సంగతి మిస్టర్ మణ్యం మిసెస్‌తో చెప్పలేదు. మిసెస్ మణ్యం మిసెస్ 'షా' ని పుస్తకం గురించి అడిగితే బాగుండదని వూరుకుంది.

ఇలా ఎవరు ఎవరిని పుస్తకం గురించి అడిగితే కథ ఎక్కడ అడుగుతారో అని ఎవరూ ఎవరిని పుస్తకం అడగలేదు!

చేరాల్సిన గూట్లోకి మాత్రం పుస్తకం చేరడం అరుదైన సంఘటనగా మిగిలిపోయింది ఎల్లెస్ మణ్యానికి!